ఎమ్మెల్యే తలసానికి సన్మానం



చార్మినార్: పాతబస్తీలో జరిగిన ఆషాడమాసం బోనాల జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గతంలో మంత్రిగా అందించిన సేవలకు తాము ఎన్నటికి మరచి పోలేమని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు కొనియాడారు. గాజుల అంజయ్య, రాకేశ్ తివారి, సదానంద్‌యాదవ్, జనగామ మధుసూదన్‌గౌడ్, అనంతోజు హన్స్‌రాజ్, దినేష్ ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

మహిళలకు శారీరక భద్రత అవసరం

అబిడ్స్ : మహిళా సిబ్బందికి మానసిక శ్రేయస్సుతో పాటు శారీరక భద్రత కూడా ఎంతో అవసరమని డైమండ్ జూబ్లీ హైస్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత గాడె పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయులకు శారీరక భద్రత కోసం తరచూ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఆత్మరక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సంస్థతో తమ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆత్మరక్షణ , శారీరక భద్రతకు ఆత్మరక్షణ శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. అన్నిరంగాల్లో రాణించేలా తమ పాఠశాల యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. రాబర్ట్ గోరిస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- రైల్వే ట్రాక్‌లకు ఇరువైపులా బస్తీలు
- దడ పుట్టిస్తున్న రక్షణలేని పాతబస్తీ ట్రాక్‌లు

చార్మినార్: పాతబస్తీ డబీర్‌పురా రైల్వేస్టేషన్ నుంచి ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ వరకు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ లేకపోవడంతో స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. పాతబస్తీ రైల్వేట్రాక్‌లకు ఇరువైపులా పెన్సింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాక్‌లకు ఇరువైపులా గృహ సముదాయాలు ఉండటంతో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా.. ఈ ప్రమాదాలకు గురౌతున్నారు. ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని రైల్వేట్రాక్‌లకు ఇరువైపులా ఉన్న బస్తీవజలు ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

- గతంలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి. ఎవరూ ప్రమాద తీవ్రతను గుర్తించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- రైల్వే అధికారులు, పాతబస్తీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో దశాబ్దాల క్రితం పాతబస్తీ మీదుగా వేసిన రైల్వేట్రాక్‌లతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు.

బస్తీల్లో జనాభా పెరగడంతో...

- ఒకప్పుడు ఈ రైల్వేట్రాక్‌లకు దగ్గరగా చుట్టుపక్కల అంతగా ప్రజల రద్దీ లేకపోవడంతో ఈ ట్రాక్‌లతో స్థానికులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. జనాభా రద్దీ పెరగడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.
- ట్రాక్‌లకు దగ్గరగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్‌ల పక్కనే ఇళ్లు ఉన్నందున ట్రాక్‌లకు రెండువైపులా రక్షణ కోసం పెన్సింగ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.
- ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో గతంలో మలక్‌పేట్ రైల్వేస్టేషన్ నుంచి ఆజంపురా వరకు రైల్వేట్రాక్‌లకు ఇరువైపులా రక్షణ కోసం ఫెన్సింగ్ వేశారు. దీంతో మలక్‌పేట్ రైల్వేస్టేషన్ పరిధిలోని గృహ సముదాయాల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక మిగిలిన ఏరియాల్లో కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



యాకుత్‌పురా–ఉప్పుగూడ రైల్వే ట్రాక్‌కు కనిపించని పెన్సింగ్

ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు

రైల్వేట్రాక్‌లకు ఇరువైపుల ఉన్న నివాస ప్రాంతాల వారికి రోజూ ప్రమాదం పొంచి ఉంది. రైల్వేపట్టాల నుంచి రాకపోకలు సాగించే వారు అప్పుడప్పుడు ప్రమాదాల బారినపడుతున్నారు. చిన్నారులు తమ ఇంటి ముందున్న రైల్వేట్రాక్‌లను ఆశ్రయించి ఆటలాడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– పాతబస్తీలో మలక్‌పేట్, డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ, ఫలక్‌నుమా తదితర రైల్వే స్టేషన్లున్నాయి. ఈ రైల్వే స్టేషన్లు పూర్తిగా పాతబస్తీలోని గృహ సముదాయాల మధ్యే ఉన్నాయి.

గతంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు...

- గతేడాది నవంబర్‌లో యాకుత్‌పురా–ఉప్పుగూడ–ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల పరిధిలోని ట్రాక్‌లపై రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.
- పెన్సింగ్ లేని కారణంగా ప్రజలు పట్టాలు దాటుతూ ప్రమాదాల పాలవుతున్నారు.
- చుట్టూ తిరిగి వెళ్లలేని పాదచారులు పట్టాలు దాటుతూ.. మృత్యువాత పడుతున్నారు. రైల్వే కట్ట వద్ద చిన్నారులు ఆటలాడుతూ.. ప్రమాదాలకు గురౌతున్నారు.
- డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ, ఫలక్‌నుమా తదితర రైల్వేస్టేషన్ల పరిధిలోని ట్రాక్‌లకు ఇరువైపులా రక్షణ కోసం రిటరి న్గింగ్ వాల్, పెన్సింగ్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
- 2011 ఏప్రిల్ 28న ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో గౌలిపురాలోని మేకలమండికి చెందిన స్థానికుడు శేషు మణి మృతి చెందాడు.
- 2011 జూలై 21న, అలియాబాద్ ప్రాంతానికి చెందిన బండి జానకీరాం తలకు రైలింజన్ కొన భాగం తగలడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.
- చాంద్రాయణగుట్ట నుంచి కందికల్‌గేట్ వైపు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. సికింద్రాబాద్ నుంచి ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న పుష్‌పుల్ రైలు ఢీ కొట్టడంతో మృతి చెందాడు.
- 2011 డిసెంబర్ 14న తలాబ్‌కట్టా భవానీనగర్ ప్రాంతానికి చెందిన కూరగాయలు విక్రయించే షకీలా బేగం (60) ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ ట్రాక్‌పై మృతి చెందింది.
- సికింద్రాబాద్ నుంచి ఫలక్‌నుమా స్టేషన్‌కు వస్తున్న ఎంఎంటీఎస్ రైలు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆమె కాలు తెగిపడి అక్కడికక్కడే మృతి చెందింది.

అవార్డు ప్రదానం



నాగ్‌నాథ్ మాశెట్టి

చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి–జగదేవీ మాశెట్టి దంపతులు ఉత్తమ ఆదర్శ శరణ్ దంపతుల అవార్డు–2023కు ఎంపికయ్యారు. పాతబస్తీ కోకర్‌వాడికి చెందిన నాగ్‌నాథ్ మాశెట్టి దంపతులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొంటుండటంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన శరణు విశ్వరచన ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేయనుంది. ఈనెల 25న మైసూర్‌లో జరిగే అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వారు ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా నాగ్‌నాథ్ మాశెట్టి మాట్లాడుతూ.. గత ఐదు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉన్నామన్నారు. సమాజంలోని పేద జంటలకు పుస్తే, మెట్టలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లతో పాటు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు, ఏడాదికొకసారి చేప ప్రసాదం కోసం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు వచ్చే బాధితులకు ఉచితంగా టీ, టిఫిన్‌లతో పాటు లంచ్ ఏర్పాటు చేసి ఆహార పదార్థాలను అందజేయడం జరుగుతుందన్నారు.

తవ్వారు.. వదిలేశారు



చంద్రానగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న అంజదుల్లాఖాన్

చార్మినార్: చంద్రానగర్–సాదత్‌నగర్‌లో రెండ్రోజుల క్రితం తవ్వి వదిలేసిన రోడ్డుతో స్థానిక ప్రాంతాల ప్రజలు పలు ఇబ్బందులకు గురౌతున్నారని.. పనులను వెంటనే ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఎంబీటీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆయా బస్తీలలో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్–7 ఈఈ, డీఈ, ఏఈలు క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా తమ కార్యాలయాలకే పరిమితమవుతూ.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం తవ్విన వదిలేసిన రోడ్డులో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారని ఆరోపించారు. తవ్వి వదిలేసిన రోడ్డుతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు



పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక జానకీ సమేత వీర వెంకట విజయ రాఘవస్వామి మఠ ఆలయానికి 800 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మఠ ఆలయం దక్షిణ కాశీ, రెండో భద్రాద్రిగా కూడా పిలవబడుతుంది. అయోధ్య రామచంద్రజీ మఠం ఆధ్వర్యంలో ఉన్న ఈ మఠ ఆలయం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశికి ముస్తాబైంది. సంగం మఠ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంతో పాటు వైకుంఠ ఏకాదశి రోజున విష్ణుమూర్తి మూడు అవతారాలను ఒకేచోట దర్శించుకోవచ్చు. ఉత్తర ద్వారంలో లక్ష్మీనరసింహుడు కొలువుదీరి ఉంటాడని ఆయనను దర్శించుకుని ఆయన కింద నుంచి ఆలయంలోకి ప్రవేశించే మహాభాగ్యం ఇక్కడ లభించనుంది. ఈ ఏడాది స్వామి వారికి ప్రీతిపాత్రమైన శనివారం రోజు వైకుంఠ ఏకాదశి సందర్భంగా పీఠాధిపతులు రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నుంచే వివిధ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. వైకుంఠ ఏకాదశి రోజు ఉడికించిన ఆహార పదార్థాలను తినకుండా ఉపవాసాలు చేయడం మంచిదన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆయన కృపాశీస్సులతో పాటు ముక్కోటి దేవతల దీవెనలు పొందాలని పీఠాధిపతులు రాహుల్ దాస్ బాబా వివరించారు.

విద్యార్థులకు విద్యతో పాటు జీవనోపాధి నైపుణ్యాలు



ఉన్నత విద్యామండలి కమిషనర్ బుర్రా వెంకటేశంను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: విద్యార్థులకు చదువుతో పాటు జీవనోపాధి నైపుణ్యాలు కూడా నేర్పేందుకు త్వరలోనే ప్రణాళికను రూపొందిస్తామని ఉన్నత విద్యామండలి కమిషనర్ బుర్రా వెంకటేశం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం బుధవారం ఆయనను కలిసి కమిషనర్‌గా నియమితులైన సందర్భంగా అభినందిస్తూ.. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సాధనకోసం శిక్షణ, నైపుణ్యాలు నేర్పడంతో పాటు విద్యార్థులకు స్వయం ఉపాధి వైపు మళ్లించే విధంగా ప్రోత్సహించేందుకు కృషిచేస్తామన్నారు. దీనికి ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. అందరి సహకారంతో విద్యార్థుల్లో విద్యానైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాసరాజు, జాయింట్ డైరెక్టర్ యాదగిరి, ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, అకాడమీ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ బాలబాస్కర్, ప్రిన్సిపల్స్ డాక్టర్ గీతలక్ష్మి పట్నాయక్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ రామచంద్రం, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వసంత, డాక్టర్ సునంద తదితరులున్నారు.

గురుస్వామి కృష్ణమూర్తికి సన్మానం



గోల్కొండ: వరుసగా 36 ఏళ్ల అయ్యప్పస్వామి మాలధరించి ప్రతిఏటా శబరిమల వెళ్తూ.. అయ్యప్ప స్వామిపై భక్తి చాటుకున్న బొమ్మరాజు కృష్ణమూర్తి గురుస్వామిది గొప్ప వ్యక్తిత్వం అని గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ అన్నారు. శబరిమల ముఖ్య తాంత్రికుడు మురళీనంబూద్రి చేతుల మీదుగా సెంగోల్ స్వీకరించి నగరానికి తిరిగి వచ్చిన కృష్ణమూర్తి గురుస్వామిని బుధవారం గుడిమల్కాపూర్‌లో ఘనంగా సన్మానించారు. గురుస్వాములు రాజయ్య, గంగాధర్, నరేష్‌యాదవ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

చార్మినార్: చార్మినార్ (ఈస్ట్)లోని బాలాజీ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 23న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొనాలని గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆహ్వానిస్తూ.. దేవాలయం అర్చకులు ఆత్రేయాచార్యులు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 5.30 గంటల నుంచి 11.30 గంటల వరకు స్వామివారి నేత్ర దర్శనం ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భంగా చార్మినార్ ప్రధాన వీధుల్లో స్వామివారి పల్లకి సేవా ఊరేగింపు కొనసాగుతుందన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సుల్తాన్‌బజార్ : జాంబాగ్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య లేకుండా కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌లోని హిందీనగర్‌లో ఓవర్‌ఫ్లో అయిన డ్రైనేజీ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. జాంబాగ్ డివిజన్‌లో పారిశుధ్యం, డ్రైనేజీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. బస్తీలలో సమస్యలు ఉంటే తనకు నేరుగా తెలియజేయాలని కోరారు. డివిజన్‌ను సమస్య రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. వాటర్‌వర్క్స్ జాంబాగ్ డివిజన్ మేనేజర్ శేఖర్, నాయకులు రఘు, సన్నీ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



గోల్కొండలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా కూడా తాను ఉదయం , రాత్రి సమయంలో సమస్యలు తెలుసుకోవడానికి బస్తీలలో పర్యటిస్తున్నానన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున కార్వాన్‌లోని గోల్కొండ, లంగర్‌హౌజ్, టోలిచౌకీ డివిజన్‌లలో డ్రైనేజీ సమస్య తలెత్తిందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరునాడే తాను వివిధ శాఖల అధికారులతో కలిసి వారివారి ప్రాంతాల్లో పర్యటించాలని కోరానన్నారు. గోల్కొండ మోతీదర్వాజ, ఖాజీగల్లీ, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్లు దెబ్బతిన్నాయని దీని వల్ల రోడ్లపై మురుగు ప్రవహిస్తుందన్నారు. ఈ సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని ఆయన జలమండలి అధికారులను ఆదేశించారు. షేక్‌పేట్ జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బదరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

పాత్రికేయుడు బుర్హానుద్దీన్‌కు సన్మానం



గోల్కొండ: పాత్రికేయుల జీవితాలు ఎన్నో ఒడిదుడుకులతో కూడుకుని ఉంటాయని ప్రముఖ పాత్రికేయుడు హేతేమాద్ ఉర్దూదినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ బుర్హానుద్దీన్‌ను అన్నారు. హేతేమాద్ 18వ వార్షికోత్సవం సందర్భంగా గ్రేటర్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్ జాహేద్ బుధవారం ఆయనను సన్మానించారు.

రైల్వే కార్మికుల హక్కుల సాధనకు కృషి



సదస్సుకు హాజరైన ప్రతినిధులు

నాంపల్లి: రైల్వే కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ పనిచేస్తుందని సంఘం సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షులు ఎన్‌వీఎన్.చౌదరి, కార్యదర్శి వి.ప్రభురాజ్ అన్నారు. ఎస్సీఆర్ఈ సంఘ్ డివిజన్ కార్యాలయంలో 'కార్మికుల హక్కులు–పరిరక్షణ' అనే అంశంపై మూడ్రోజుల పాటు జరిగిన అవగాహన సదస్సు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా సీఎంఈ ఓఎస్‌టీ.డీ.సత్యవాణి హాజరై కార్మికుల హక్కులపై మాట్లాడారు. డివిజన్ కార్యదర్శి ప్రభురాజ్ అధ్యక్షతన జరిగిన ముగింపు సదస్సుకు తాండూరు, ఖాజీపేట, డోర్నకల్, విజయవాడ, కాగజ్‌నగర్, బెల్లంపల్లి బ్రాంచ్‌ల నుంచి సంఘ్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎన్.చౌదరి అధ్యక్షోపన్యాసం చేస్తూ.. రైల్వే కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతామని చెప్పారు. మూడ్రోజుల పాటు జరిగిన సదస్సుకు సంఘ్ ప్రతినిధులు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సంఘ్ డివిజన్ అధ్యక్షులు ఎన్.వీ.ఎన్.చౌదరి, వీ.ఎస్.మురళీకృష్ణ, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

గోల్కొండ: మార్నింగ్ వాకర్స్ కోసం ప్రైవేటు ఆసుపత్రి వారు మెడికల్ క్యాంప్ నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని కార్వాన్ కుల్సుంపురా మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి రక్షిత్‌సాగర్ అన్నారు. బుధవారం కుల్సుంపురా పార్కులో మార్నింగ్ వాకర్స్ కోసం శ్రీకర ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో మార్నింగ్ వాకర్స్ కాకుండా వారి కుటుంబసభ్యులు, కుల్సుంపురా వాసులకు వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. శ్రీకర ఆసుపత్రికి చెందిన ఫిజిషియన్ అహేమర్ ఆలమ్, ఆర్థోపెడిక్ సర్జన్ మధు గెడ్డం, ఏఎంఎం పవన్‌కుమార్ దుబ్బులూరు తదితరులున్నారు.

'కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ'



మంత్రి శ్రీధర్‌బాబును సత్కరించిన పోల్కం శ్రీనివాస్ మేరు

అబిడ్స్ : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మేరు దర్జీ టైలర్స్ యువజన సంఘం అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ మేరు పేర్కొన్నారు. 'పదేళ్లుగా గత ప్రభుత్వం తెలంగాణను నట్టేట ముంచిందని' ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబును దర్జీ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్‌లు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్ : యంగ్ ఉమెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్ బొగ్గులకుంటలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ చెట్టు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. హైదరాబాద్ జిల్లా కింగ్‌కోఠి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అనాథ పిల్లలకు బహుమతులు అందజేశారు. ఏసుక్రీస్తు జనన కథను జీవితంలోకి తెచ్చే నాటకంతో పాటు చిన్నారులు ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సమాజంలో వివక్షకు గురవుతున్న మహిళల పక్షాన యంగ్ ఉమెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ నిలబడుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి రాణి శేషాద్రి తెలిపారు. అసోసియేషన్ ద్వారా కరోనా సమయంలో అనేక మందికి తోడ్పాటును అందించినట్లు ఆయన స్పష్టం చేశారు. పద్మ అలెక్స్, బోర్డు సభ్యులు మిస్సెస్ లేయా ప్రేమలీల, శిమ్మిరవి, దయామరుత పాల్గొన్నారు.


డీఈఓ కార్యాలయంలో..

గన్‌ఫౌండ్రీ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని అన్నారు. బుధవారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. డీఈఓ రోహిణి, విద్యాశాఖ అధికారులు నర్సింగ్‌రావు, టీఎన్జీఓస్ నగర కార్యదర్శి విక్రమ్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ విద్యాశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



ముజీబ్, డీఈఓ రోహిణి తదితరులు

మహిళను దుర్భాషలాడిన వ్యక్తికి జైలు



నిందితుడు గణేష్

విజయనగర్‌కాలనీ : మహిళను దుర్భాషలాడిన వ్యక్తికి మూడ్రోజుల జైలుశిక్ష పడిన ఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సై.మహ్మద్ జాహేద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ రవీంద్రనగర్‌లో నివసించే ఎం.గణేష్ దగ్గర అదే ప్రాంతంలో నివసించే నర్సింహా గత అక్టోబర్ నెలలో అవసరం నిమిత్తం రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో ఈనెల 18న నర్సింహా ఇంటికి వెళ్లి దాడి చేయడంతో పాటు అతడి భార్య అమృతను దుర్భాషలాడాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి సత్యనారాయణ నిందితుడికి మూడ్రోజుల జైలుశిక్షను విధించారు.

రవీందర్‌నాయక్‌కు శుభాకాంక్షల వెల్లువ



టీఎన్జీఓ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సుల్తాన్‌బజార్ : టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ అధ్యక్షులు మామిడి ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీహెచ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వం నిర్వర్తించే అన్ని పనులను ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. టీఎన్జీఓ నాయకులు సంఘం ప్రధాన కార్యదర్శి హరి, కోశాధికారి క్రాంతికిరణ్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి, భరణి, జయకుమార్, సాయి, ఆశీష్, ప్రభాకర్ తదితరులున్నారు.

- తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాబర్ట్ బ్రూస్, అశోక్‌ల ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ రవీందర్‌నాయక్‌కు పుష్పగుచ్ఛాలు ఇస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో సమస్యలను పరిష్కరించాలని వారు కోరినట్లు సమాచారం.

అక్రమ పార్కింగ్‌పై చర్యలేవీ?

- కాలనీలకు పాకిన అక్రమపార్కింగ్
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



పాత ముంబాయ్ జాతీయ రహదారిపై..



అల్‌అమ్రా కాలనీలో రోడ్డుకు ఇరువైపుల అక్రమ పార్కింగ్‌లు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లతో ప్రజలు బేజారెత్తిపోతున్నారు. పాదాచారులు రోడ్డుపై నడవాలంటేనే ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఉంది. మెహిదీపట్నంతో పాటు ఆసిఫ్‌నగర్ రోడ్డు, మాసబ్‌ట్యాంక్, టోలిచౌకీ చౌరస్తా, పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అక్రమపార్కింగ్‌లు జోరుగా సాగుతున్నాయనే విమర్శలున్నాయి. మాల్స్, రెస్టారెంట్స్, ప్రభుత్వ కార్యాలయాల ముందు అక్రమ పార్కింగ్‌ల దందా జోరుగా సాగుతుంది. నానల్‌నగర్, టోలిచౌకీ మెయిన్ రోడ్డు, గెలాక్సీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పాదాచారుల కోసం వేసిన ఫుట్‌పాత్‌లపై అక్రమంగా స్టాల్స్ వెలిశాయి. వీటి పక్కనే ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్ కొనసాగుతుంది. దీంతో రోడ్డు దాటడానికి పాదాచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ పార్కింగ్‌ల కారణంగా ద్విచక్ర వాహన చోదకులు సైతం ప్రమాదాల బారినపడుతున్నారు. మెహిదీపట్నంలోని రైతుబజార్, హోటల్స్‌తో పాటు రెస్టారెంట్ల ముందు కారులు, ద్విచక్ర వాహనాలు రోడ్లపైనే పార్కుచేసి ఉంటున్నాయి. అసలే రద్దీగా ఉండే మెహిదీపట్నం చౌరస్తా పరిసరాలు అక్రమ పార్కింగ్‌లకు కేంద్రాలుగా మారాయి. ఓ వైపు రెస్టారెంట్లు మరో వైపు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్న ఈ ప్రాంతంలో రోడ్లపైనే అక్రమ పార్కింగ్ కొనసాగుతుందని ఆరోపణలున్నాయి. టోలిచౌకీ చౌరస్తా వద్ద సైతం అక్రమ పార్కింగ్‌ల జోరు కొనసాగుతుందని పలువురు వాపోతున్నారు. తూమ్స్‌రోడ్డు, అర్బాబ్ హోటల్ చౌరస్తా, అమెరికన్ సైన్స్ దవాఖానాతో పాటు టోలిచౌకీ నుంచి హకీంపేట్ వెళ్లే రహదారి ఇరువైపుల సైతం రోడ్డుపై అక్రమ పార్కింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.